కథ

# ఘటన


తులసి బాలకృష్ణ

87901 15544


బయట హోరున కురుస్తున్న వాన వైపే చూస్తూ..

''గిప్పుడు మనం అమ్మను గీ పట్నం సర్కారు దవాఖానా కాన్నుంచెల్లి మన ఊరికి దీస్కపోవుడు గంత అవుసరమా అయ్యా?'' అడిగింది పుష్ప.. వదలని భయంతో, అయోమయంగా!

కూతురి తల నిమురుతూ పూడుకుపోతున్న గొంతును బలవంతాన సవరించుకుంటూ..

''తీస్కపోవుడైతే తప్పదు బిడ్డా! మీ అమ్మ పానం ఎప్పుడేమైతదో సెప్పలేని తీరుగుంది గదా?'' అన్నాడు మల్లయ్య.

పుష్ప గొంతు బాధతో, భయంతో కీచుమన్నది.

''మల్ల గందుకనే అంటన్న.. గిసుంటి పరిస్తితిల్ల దవాఖానలనే ఉంచుడు మంచిదైతది గదా? బతకనీకి చాన్సుండొచ్చు. ఊరు దీస్కపోవుడు పాగల్ పనైతదిగదనే?!''.. అన్నది పుష్ప.

కన్నీళ్లను ఆపుకొంటూ, కూతురికి ధైర్యం కలిగించే ప్రయత్నం చేస్తూ..

''ఏంగాదులే బిడ్డా! బగమంతుని మీద బారమేద్దాం. ఏంజేస్తం జెప్పు? జూస్తనే ఉంటివి గద.. నిన్న రాత్రినుం చెల్లి మీయమ్మ ఒకటే తీరుగ కండ్ల నీరుబెట్టుకుని అంటానే ఉన్నది.. 'నన్ను మన ఊరికి తీస్కపోన్రీ! నేను అత్తమ్మను జూడాలే.. బతికినా సచ్చినా ఆమె ఒల్లోనే!' అని. గిప్పుడు మనం తీస్కపోకుంటే.. ఇయ్యాల్నో రేపో గామెకు ఏమైన ఐతే.. 'అరే.. అంతగ మొత్తుకు జెప్పిన భీ పాపమామె ఆకరి కోర్కెను దీర్చకుండగ జంపితిమే' అని బతుకంతా ఏడ్వాలెగదా'' అని స్వగతంగా పలుకుతున్నట్లు గొణిగాడు మల్లయ్య వేదనగా.

తండ్రి మాటలతో ఏకీభవిస్తూ.. బెంగతోనే తల నిలువుగా ఆడించింది పుష్ప.

కూతురు కూడా గుండె రాయి చేసుకుని, సమ్మతించినందుకు కొద్దిగా ధైర్యం తెచ్చుకుని..

''నేనెల్లి అంబులెన్సు మాట్లాడస్త బిడ్డా! మన ఊరి డాక్టరు సాబ్ దావఖానల పెద్దోల్లకు జెప్పి, పేషంట్‌ని గిసుంటి పరిస్తితుల్ల భీ తీస్కపోవుడుకు ఒప్పించిండు. గదేదో.. ఆక్సీజన్ బందోబస్తున్న అంబులెన్సులనే తీస్కెల్లాల్నంట'' అంటూ.. వర్షంనుంచి కొంతైనా కాపాడుకోవడానికి పైబట్ట తలమీదుగా కప్పుకొని, పరుగులాంటి నడకతో హాస్పిటల్ గేటువైపు వేగంగా సాగాడు మల్లయ్య. అపస్మారకంగా పడున్న తల్లివైపే బెంగగా చూస్తూ కూర్చుండి పోయింది పుష్ప.

భర్త తనను ఊరికి తీసుకుపోతానని అనడం చెవిన పడ్డ సారమ్మలో కొంత కదలిక వచ్చి, చిరు ఆనందం కారణంగా కొద్దిపాటి శక్తి లభించి.. కూతురి కళ్లలోకి చూస్తున్నది.

ఉరుకుల మీద గాంధీ హాస్పిటల్ మెయిన్ గేటు దాటి బయటికి చేరుకున్న మల్లయ్యను ఓ అంబులెన్స్ వద్ద తడవకుండా గొడుగు చేతబట్టి నిల్చుని ఉన్న అటెండర్ నరసింహ చూసి..

''ఓ పెద్ద మడిసీ! ఇక్కడ.. ఈడకి రా'' అంటూ, చెయ్యి ఊపుతూ పిలిచాడు.

వాన చినుకుల మధ్యగా కళ్లు చిట్లించుకు చూస్తూ అటు పరిగెత్తాడు మల్లయ్య.

''గొడుగు కిందికి రా ముందు సెప్త.. తడిసిపోతన్నవు'' అని దగ్గరికి లాక్కుని..

''ఈ అంబులెన్సాయనకు అంతా చెప్పిన. ఇతని పేరు పరమేశ్. శా.. నా మంచోడు. ఈ అంబులెన్సుల ఆక్సిజన్ గిట్ల మొత్తమున్నయి. పేషంట్‌ను, మిమ్ముల్ని బద్రంగ మీ ఊర్కి తీస్కపోతడు. ఇన్నవా? కిరాయి ఎంతనేడిది నువ్వా, ఈయనా మాట్లాడుకోన్రి'' అన్నాడు నరసింహ.

''అదిభీ నువ్వే మాట్లాడరాదయ్య.. పున్నెముంటది!'' బతిమాలాడు మల్లయ్య. .

''అమ్మా! గా పని నేజెయ్య. మల్ల మజ్జన నేనేదో దంద నడిపిన అనుకుంటరు. పాపం.. ఊరి నుంచెల్లి వచ్చినోల్లూ.. పరిస్తితి జూస్తే అట్లుండెనని జాలితో ఓ మంచి అంబులెన్స్ మీకు చూపించాలెననే నేను బయటికచ్చిన. ఇన్నవా.. ఏమంటున్న? ఇగ మీరు మీరు మాట్లాడుకోన్రి. నువ్వు తడిసిపోతవు.. ముందు లోపల గూసుని మాట్లాడుకో'' అని, తనే తలుపు తీసి.. మల్లయ్యను అంబులెన్స్ డ్రైవర్ పక్క సీటులోనికి ఎక్కించి..

''పరమేశన్నా! జర జూడు పాపం. ఈళ్లను ఈళ్ల ఊర్ల జాగర్తగ దింపేసి వచ్చినంక, గా సంగతి నాకు జెప్పాలె మల్ల'' అని చెప్పి, హాస్పిటల్ లోపలికి వెళ్లిపోతున్నప్పుడు.. నరసింహ కుడికన్ను కొట్టుకున్న వింత విన్యాసంలోని భావాన్ని చదివే శక్తి మల్లయ్యకు లేదు.

లోపలికి ఎక్కి కూర్చుని, అంబులెన్స్ డ్రైవర్ పరమేశ్‌ను ఆప్తుడిగా భావిస్తూ.. అతని నుంచి సానుభూతిని ఆశిస్తూ.. వాననీటితో కలిసి చెంపల మీదుగా జారుతూన్న కన్నీటిని పైబట్టతో అద్దుకుంటూ..

''నా బార్య సావుబతుకుల మజ్జనుంది. 'ఏం జెప్పలేం!' అంటుండు డాక్టర్ సాబ్. ఆమెనేమో.. 'నన్ను మన ఊరికి దీస్కపోన్రీ.. నేను అత్తమ్మను జూడాలె' అంటూ ఒకే తీరుగ మొత్తుకుంటాంది. ఆమె అంటే ఈమెకు, ఈమె అంటే ఆమెకూ పానం. ఇదొక ఇంత.. గీ లోకంల. ఎప్పుడు తిట్టుకునే,

